క్లుప్తంగా

నేడు ఓటరు నమోదు కార్యక్రమం

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని అంజయ్యనగర్‌లో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఆదివారం ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించనున్నట్లు వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తెలిపారు. రోడ్ నెంబర్ 9లో ఈ కార్యక్రమం జరగనుందని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు ఆలివ్ మిఠాయి అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డుల ప్రదానం

కూకట్‌పల్లి: ఆలివ్ మిఠాయి అకడమిక్ ఎక్సలెన్స్ అవార్డు ప్రదానోత్సవ వేడుక ఆదివారం కూకట్‌పల్లిలోని ఎన్‌కెఎన్‌ఆర్ గార్డెన్స్‌లో నిర్వహించనున్నట్లు ఆలివ్ మిఠాయి అధినేత దొరరాజు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 10 వ తరగతి విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 10వ తరగతి పరీక్షల్లో 10/10 పాయింట్లు సాధించిన బబ్బుగూడ జెడ్‌పీహెచ్‌ఎస్ విద్యార్థిని కార్తీక, శంషీగూడ విద్యార్థి దినేష్‌లకు రూ. లక్ష చొప్పున అందించనున్నారు. అన్ని పాఠశాలల్లో ప్రతి స్కూల్ టాపర్‌కు రూ.10 వేల చొప్పున నగదు బహుమతులు అందజేయనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ప్రత్యేక అతిథిగా డీఈఓ విజయకుమారి, గౌరవ అతిథిగా ఎంఈఓ ఆంజనేయులు హాజరుకానున్నట్లు తెలిపారు.

హైటెక్ సిటీ రైల్వేస్టేషన్ శంకుస్థాపన పనుల పరిశీలన

కూకట్‌పల్లి: అమృత్ భారత్ రైల్వే స్టేషన్ పథకంలో భాగంగా హైటెక్ సిటీ రైల్వేస్టేషన్ ఆధునీకరణ పనులను ఆదివారం ఉదయం 9 గంటలకు ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా హైటెక్ సిటీ రైల్వేస్టేషన్‌లో శంకుస్థాపనకు సంబంధించిన పనులను స్థానిక బీజేపీ నాయకులతో కలిసి శనివారం మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి పరిశీలించారు. కార్యక్రమంలో మూసాపేట కార్పొరేటర్ మహేందర్, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, ప్రీతం రెడ్డి, జిల్లా నాయకులు సుగుణ చౌదరి, పి. సాయినాథ్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు గంధం రాజు, వినోద్‌గౌడ్, నాయకులు సుధ, పవన్, ప్రేమ్‌నాథ్, కళ్యాణ్, లక్ష్మీ, సుబ్బారావు, చంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడులకు కేంద్రంగా హైదరాబాద్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: పెట్టుబడులను ఆకర్షించే విషయంలో హైదరాబాద్ ప్రపంచ స్థాయిలో పోటీ పడుతోందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శనివారం తెలంగాణ అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్రంలో మౌలిక సదుపాయాల కల్పన, పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి ఫలితాలపై జరిగిన చర్చలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో తొమ్మిదేళ్లలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందిందని, నిరంతర విద్యుత్, ఇంటింటికి తాగునీరు అందించడం జరిగిందన్నారు. హైదరాబాద్ నగరంలో 10 లక్షల సీసీ కెమెరాలు, రూ. 3866 కోట్లతో సేవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతినగర్ నుంచి జేఎన్టీయూ వరకు ఫ్లైఓవర్ నిర్మాణాన్ని చేపట్టి ట్రాఫిక్ సమస్యకు శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఎస్ఎన్‌డీపీ పథకం కింద చేపడుతున్న కాలువ నిర్మాణాలతో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని అంగడిపేట్, సుచిత్ర పరిసర లోతట్టు ప్రాంతాలకు వరద ముంపునకు శాశ్వత పరిష్కారం లభించిందని ఆయన పేర్కొన్నారు.

వీధి కుక్కల నియంత్రణకు చర్యలు



కుత్బుల్లాపూర్: వీధి కుక్కల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని కూకట్‌పల్లి జోనల్ వెటర్నరీ అధికారి ఈశ్వర్ రెడ్డి అన్నారు.. కుత్బుల్లాపూర్, గాజులరామారం, అల్వాల్ సర్కిళ్ల పరిధిలో 14 ఫిర్యాదులు అందడంతో శనివారం సిబ్బందితో కలిసి వీధి కుక్కలను పట్టుకుని వాటికి యాంటీ రాబిస్ ఇంజక్షన్లు చేయించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలపై వెళ్లేటప్పుడు కుక్కలు వెంట పడితే స్పీడ్‌గా వెళ్లకుండా కంట్రోల్ చేసుకుంటే వాటికి అవే వెళ్లిపోతాయని తెలిపారు. కొన్ని కాలనీల్లో కుక్కలను పట్టుకునేందుకు వెళ్లి సిబ్బంది పట్ల స్థానికులు దురుసుగా ప్రవర్తిస్తూ వాటిని పట్టుకోకుండా అడ్డుకుంటున్నారని, ఇది సరైన పద్ధతి కాదని స్పష్టం చేశారు. కొందరు ఇంట్లో మిగిలిపోయిన ఆహారాన్ని పెడుతున్నందున కుక్కల సంఖ్య పెరిగే అవకాశం ఉందని తెలిపారు. పలు ప్రాంతాల్లో పట్టుకున్న కుక్కలను పరీక్ష కేంద్రానికి తీసుకెళ్లి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసి వాటిని వదిలి వేస్తున్నామని, ఏదైనా జబ్బులు ఉన్నట్లు గుర్తిస్తే ఇంజక్షన్లు ఇచ్చి రోగ నిరోధక శక్తిని తగ్గించే విధంగా చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ఫిర్యాదు చేసిన 48 గంటల్లోనే చర్యలు చేపడుతున్నామని, ప్రతిరోజు 30 వరకు ఫిర్యాదులు వస్తున్నాయని సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం


గాంధీనగర్ కమ్యూనిటీ హాల్ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్

రంగారెడ్డినగర్: ప్రజా సంక్షేమ ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తోందని రంగారెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ విజయశేఖర్‌గౌడ్ అన్నారు. శనివారం డివిజన్ పరిధిలోని గాంధీనగర్‌లో మహిళా భవనం, కమ్యూనిటీ హాల్ మొదటి అంతస్తు నిర్మాణం, గురుమూర్తినగర్‌లో రూ. 18 లక్షలతో చేపట్టనున్న కమ్యూనిటీ హాల్ పనులకు కార్పొరేటర్ శంకుస్థాపన చేశారు. స్థానిక సమస్యలను చర్చించుకోవడానికి, మహిళల శిక్షణ కార్యక్రమాలకు ఉపయోగపడే భవనాలను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ జయరామ్, శంకరయ్య, జల్దా లక్ష్మి నాథ్, అబ్దుల్ ఖాదర్, ఎల్లయ్య, సత్యనారాయణ, కమలా బాయి తదితరులు పాల్గొన్నారు.

స్నేహానికి ఎల్లలు లేవు


ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టుకుంటున్న విద్యార్థులు

సుభాష్‌నగర్: స్నేహానికి ఎల్లలు లేవని నార్త్ సిటీ హైస్కూల్ ప్రిన్సిపాల్ కోల వెంకటేష్ ముదిరాజ్ అన్నారు. శనివారం సూరారంలోని నార్త్ సిటీ హైస్కూల్‌లో స్నేహితుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒకరికొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టుకున్నారు. అనంతరం శ్రీకృష్ణ సుధాముల స్నేహం గొప్పతనంపై నాటక ప్రదర్శన నిర్వహించారు.

రాహుల్ గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం


రాహుల్‌గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నర్సారెడ్డి భూపతిరెడ్డి..

దుండిగల్: ఏఐసీసీ అగ్ర నేత రాహుల్‌గాంధీ అనర్హత వేటుపై సుప్రీం కోర్టు స్టే విధించడంపై కాంగ్రెస్ పార్టీ నేతలు సంబరాలు చేసుకున్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని 8 డివిజన్లు, నిజాంపేట కార్పొరేషన్, కొంపల్లి, దుండిగల్ మున్సిపాలిటీల్లో రాహుల్‌గాంధీ ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేశారు. గండిమైసమ్మ చౌరస్తాలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి ఆధ్వర్యంలో రాహుల్‌గాంధీ చిత్రపటానికి పాలాభిషేకం చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తుందని, అందులో భాగంగానే రాహుల్‌గాంధీపై కేసులు బనాయించారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రోజులు దగ్గర పడ్డాయన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు బొంగునూరి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షుడు సదానందం, దుండిగల్ మున్సిపాలిటీ అధ్యక్షుడు మద్దికుంట నవీన్‌రెడ్డి, పోషి మహేశ్, చింతకింది సురేశ్, కుమార్ యాదవ్, సాధు యాదవ్, పరశురాం, జక్కుల మల్లేష్, శ్రీనివాస్, సీతారాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీదీపా దాస్ మున్షీకి ఘన స్వాగతం..

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సీనియర్ పరిశీలకురాలు మాజీ ఎంపి శ్రీదీపా దాస్ మున్షీ మొదటిసారిగా రాష్ట్రానికి వచ్చిన సందర్భంగా టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి ఆధ్వర్యంలో ఆమెకు శంషాబాద్ ఏయిర్‌పోర్టులో ఘన స్వాగతం పలికారు. బొకే అందజేసి శాలువాతో సత్కరించారు.

బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఓటమి తప్పదు


జీడిమెట్ల పీఎస్‌లో ఎన్‌ఎస్‌యూఐ నాయకులు

జీడిమెట్ల: తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు న్యాయమైన హక్కుల సాధనకు పోరాడుతున్న వారిని అణచివేస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి ఓటమి తప్పదని రాష్ట్ర ఎన్ఎస్‌యూఐ జనరల్ సెక్రటరీ గొల్లజాన్ అన్నారు. శనివారం ఎన్ఎస్‌యూఐ ఆధ్వర్యంలో అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో కుత్బుల్లాపూర్‌కు చెందిన ఎన్ఎస్‌యూఐ విద్యార్థి సంఘం నాయకులను జీడిమెట్ల పోలీసులు శుక్రవారం రాత్రి ముందస్తుగా అరెస్టు చేశారు. అరెస్టైన వారిలో సాయిప్రవీణ్‌గౌడ్, పృథ్వి, రాకేష్ ముదిరాజ్, జగదీష్‌రెడ్డి, రాజు, రవీందర్ ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు మోసపూరిత మాటలు చెప్పి గద్దెనెక్కిన కేసీఆర్ ప్రభుత్వం త్వరలోనే కుప్పకూలడం ఖాయమన్నారు. రాష్ట్ర ప్రజలు బీఆర్ఎస్ ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తితో ఉన్నారని ఓటుతో ఈసారి ప్రభుత్వానికి బుద్ధి చెబుతారన్నారు.

అవినీతికి కేరాఫ్‌గా బీఆర్ఎస్ పాలన

నిజాంపేట్: అవినీతిమయ బీఆర్ఎస్ పాలనతో ప్రజలు విసుగు చెందారని, కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని టీపీసీసీ ప్రతినిధి కొలన్ హన్మంతరెడ్డి అన్నారు. మలలంపేట్‌కు చెందిన అశోక్, ప్రేమ్ కుమార్, రాజు, ప్రతాప్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో శనివారం పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి హన్మంతరెడ్డి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు దగా పడ్డారని, తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలర్పించిన అమరవీరుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం , రూ.25 వేలు గౌరవ పింఛన్ ఇస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ఆయా కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి


డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ జ్యోతి

నిజాంపేట్: డివిజన్ పరిధిలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని నిజాంపేట్ కార్పొరేషన్ 27వ డివిజన్ కార్పొరేటర్ జ్యోతి అన్నారు. శనివారం ఆమె భండారి లేఅవుట్‌లోని 7డి రోడ్ జంక్షన్‌లో డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూగర్భ డ్రైనేజీ లైన్ పూర్తయితే మురుగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. త్వరలో అన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ పైప్‌లైన్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు నరసింహారెడ్డి, కాంతారావు, రవీంద్రబాబు, నరసింహరాజు, భారతి, రోజా, రాణి, సునీత తదితరులు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించాలి


విద్యార్థులను అభినందిస్తున్న పాఠశాల కరస్పాండెంట్ సుందరరాజు

కుత్బుల్లాపూర్: విద్యార్థుల్లో చిన్నతనం నుండే నాయకత్వం లక్షణాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని సెయింట్ ఆంథోనీ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ కరస్పాండెంట్ నరిశెటి సుందరరాజు అన్నారు. శనివారం కొంపల్లిలోని సెయింట్ ఆంథోనీ హైస్కూల్‌లో వివిధ తరగతులకు చెందిన విద్యార్థులు టీమ్ లీడర్లుగా ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికల్లో హెడ్ గర్ల్, హెడ్ బాయ్‌లుగా విజయం సాధించిన గోయల్, అర్పితలకు బ్యాడ్జిలు అందజేసి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన మార్చ్‌ఫాస్ట్, సంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఫాదర్ విన్సెంట్ ఆరోక్య స్వామి, మల్లవరపు ధనరాజ్, సరిత, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం


సంతోష్ చౌహాన్ (ఫైల్)

సుభాష్‌నగర్: అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు అదృశ్యమైన సంఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి వచ్చిం.. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. సూరారం రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన ధన్‌రాజ్‌చౌహాన్ కుమారుడు సంతోష్ చౌహాన్ డ్రైవర్‌గా పని చేసేవాడు. జున్ 6న శ్రీశైలం వెళ్తున్నానని చెప్పి ఇంటి నుండి వెళ్లిన ఆతను తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితులు ఇళ్లల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో శనివారం ఆతడి తండ్రి ధనరాజ్ చౌహాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఆర్టీసీ ఉద్యోగుల నిరసన


జీడిమెట్ల డిపో ఎదుట నిరసన తెలియజేస్తున్న అర్టీసీ ఉద్యోగులు..

జీడిమెట్ల: జీడిమెట్ల అర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు ఉదయం రెండు గంటల పాటు బస్సులను డిపోలో నిలిపివేసి డిపో ఎదుట ఆందోళన చేపట్టారు. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తూ జారీ చేసిన ఫైల్‌పై రాష్ట్ర గవర్నర్ ఆమోద ముద్ర వేయనందుకు నిరసనగా ఉదయం 8గంటల వరకు బస్సులను డిపోల్లోనే నిలిపివేశారు. ఈ సందర్భంగా జీడిమెట్ల ముందు అర్టీసీ కార్మికులు గవర్నకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం యూనియన్ నాయకులు రాజ్‌భవన్ ముట్టడికి తరలివెళ్లారు. కార్యక్రమంలో రాపోలు గోవర్ధన్, చంద్రయ్య, వెంకటేష్, కుమారస్వామి, రాజేందర్‌రెడ్డి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల అవస్థలు..

ప్రతిరోజు బస్సుల్లో డ్యూటీలకు, కళాశాలలకు వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులు బస్సులు లేకపోవడంతో ఇబ్బందులు పడ్డారు.

అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు ప్రాణ సంకటం


గాలి పోచమ్మ బస్తీలో గొయ్యిలో పడిపోయిన బైక్

సుభాష్‌నగర్: మంచినీటి లీకేజీ, ఇతర సమస్యలు వచ్చినప్పుడు సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించకుండా వదిలేసి సమస్యను మరింత జటిలం చేస్తున్నారన్నడానికి ఈ చిత్రమే నిదర్శనంగా చెప్పవచ్చు. గాజులరామారం గాలి పోచమ్మ బస్తీలో మంచినీటి పైప్ లైన్ మరమ్మతుల కోసం రెండు రోజుల క్రితం గొయ్యి తవ్విన అధికారులు సూచిక బోర్డు పెట్టకుండా అలాగే వదిలేశారు. దీంతో ఓ వృద్ధురాలు అందులో పడి గాయపడగా, శనివారం ఉదయం బైకిస్ట్ గమనించక అందులో పడి తీవ్రంగా గాయపడ్డాడు. వాటర్ వర్క్స్ అధికారుల నిర్లక్ష్యమే ఇందుకు కారణమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా సాయిబాబా


సాయిబాబా, ఏసీపీ టౌన్‌ప్లానింగ్

కుత్బుల్లాపూర్: అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా సాయిబాబా నియమితులయ్యారు. గతంలో కుత్బుల్లాపూర్ సర్కిల్‌లో టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేసిన ఆయన నగరంలో వివిధ సర్కిళ్లలో పనిచేశారు. తిరిగి పదోన్నతిపై ఏసీపీగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సాయిబాబా సాక్షితో మాట్లాడుతూ నిర్మాణదారులు ఎటువంటి అక్రమ నిర్మాణాలు చేపట్టరాదని, ఫిర్యాదుల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని, గతంలో నోటీసులు జారీ చేసిన వాటిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని, ప్రభుత్వ ఆదాయానికి గండి కొట్టేలా వ్యవహరించే ఏ నిర్మాణమైన కూల్చివేస్తామని స్పష్టం చేశారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేయాలి


నిజాంపేట్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సంఘం సభ్యులు

నిజాంపేట్: ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మనెంట్ చేసి, వేతనాలు పెంచాలని కోరుతూ నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం నిజాంపేట్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు వెంకటేష్, ఉపాధ్యక్షుడు సంతోష్‌కుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి కేసీఆర్ గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే పర్మనెంట్‌చేసి వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నగేందర్, హరికృష్ణ, శైలజ, మహేశ్వరి, లిమేందర్, కోశాధికారులు బాలకృష్ణారెడ్డి, దుర్గేశ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

మున్నూరు కాపు నేతల అరెస్ట్


మహిళా నాయకురాలు సుధను అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు

కుత్బుల్లాపూర్: మున్నూరు కాపు ఆత్మగౌరవ మహాసేన ఆధ్వర్యంలో చేపట్టిన అసెంబ్లీ ముట్టడిని పోలీసులు భగ్నం చేశారు. శనివారం ముట్టడికి తరలి వెళ్తున్న బీజేపీ మహిళా మోర్చా మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి అరకాల సుధ, అలివేలు, వసుంధర లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎండోమెంట్ అ. దీనంలో ఉన్న మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహాన్ని కాపు సంఘానికి అప్పగించాలని డిమాండ్ చేశారు.

ఎల్లప్పుడూ అండగా ఉంటా



కుత్బుల్లాపూర్: ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని, ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించే దిశగా అధికారులపై ఒత్తిడి తెస్తానని.. ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజు అన్నారు.. కుత్బుల్లాపూర్ నియోజక వర్గ పరిధిలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు శనివారం ఆయన నివాసానికి వెళ్లి సమస్యలు ఏకరువు పెట్టారు.. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, తప్పకుండా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

నేడు అమ్మవారికి ప్రత్యేక పూజలు

జగద్గిరిగుట్ట: జగద్గిరిగుట్టపై కొండపై ఉన్న ఎల్లమ్మ ఆలయంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు సంఘం సభ్యులు తెలిపారు. ఉదయం అభిషేకం, అర్చన, అలంకరణ హారతి, అలంకరణతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించనున్నట్లు తెలిపారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



నిజాంపేట్: నిజాంపేట్‌లోని గోకరాజు రంగరాజు ఇంజినీరింగ్ కళాశాల 23వ గ్రాడ్యుయేషన్ డే శనివారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ఎన్ఐటీ రాయపూర్ డైరెక్టర్ రమణరావు, సైనోఫైసీస్ మానవ వనరుల విభాగాధిపతి పాణిగ్రాహి హాజరై విద్యార్థులకు పట్టాలు అందజేశారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు మార్కెట్ అవసరాలకు తగినట్లుగా స్కిల్స్‌ను పెంపొందించుకుని అత్యుత్తమ ఉద్యోగావకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జంధ్యాల నారాయణ మూర్తి, ప్రిన్సిపాల్ ప్రవీణ్ జుగ్గే, కార్యక్రమ సమన్వయ కర్త ఈట మల్లిఖార్జున, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.